క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మృతి



ఉసేన్‌సాబ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న శ్రీచరణ్‌రెడ్డి తదితరులు

గోరంట్ల: మల్లాపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఉసేన్‌సాబ్ (65) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉష భర్త శ్రీచరణ్‌రెడ్డి తదితర నాయకులు మల్లాపల్లికి వెళ్లి ఉసేన్ సాబ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పాలసముద్రం ఫక్రుద్దీన్‌సాబ్, మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, టౌన్ కన్వీనర్ మేదర శంకర, పలువురు మండల నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

గోరంట్ల ఉపసర్పంచ్‌కు పరామర్శ



రాజారెడ్డిని పరామర్శిస్తున్న ఉషశ్రీచరణ్

గోరంట్ల: అనారోగ్యం బారినపడి బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోరంట్ల ఉప సర్పంచ్ రాజారెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీసి.. ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీచరణ్‌రెడ్డి, జిల్లా ప్రచార విభాగపు అధ్యక్షుడు ఫక్రుద్దీన్ సాహెబ్, నాయకులు ఈశ్వర్, వెంకటేశు తదితరులు ఉన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



విద్యుత్ వెలుగుల్లో వడ్డే ఓబన్న చిత్రపటం

అమరాపురం: మండలంలోని వీరాపురం గ్రామంలో వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వడ్డే ఓబన్న చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో కొలువుదీర్చి, గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వడ్డే ఓబన్న దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. వడ్డెర కులస్తులు ఐకమత్యంగా ఉండి పిల్లలను బాగా చదివించాలన్నారు. చదువుతోనే అన్ని సాధ్యమన్నారు. సంక్షేమ ఫలాల కోసం పోరాటం సాగిద్దామన్నారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన



అమరాపురంలో స్టవ్ పనితీరుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని కాచికుంట గ్రామంలో మంగళవారం గ్యాస్ సిలిండర్ వాడకం, స్టవ్ పనితీరుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అమరాపురంలోని శ్రీ సాయిదుర్గా ఏజెన్సీ నిర్వాహకుడు జీ.బీ.శివకుమార్, రవికుమార్, కరుణాకర్, నాగరాజు మాట్లాడుతూ.. తమ ఏజెన్సీ కేవలం సిలిండర్లను పంపిణీ చేయడమే కాకుండా గ్యాస్ స్టవ్ వాడకం, సర్వీసింగ్, ట్యూబ్ మార్చడం తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. రెగ్యులేటర్‌లో ఏవైనా సమస్యలు వస్తే వినియోగదారుడి ఇంటి వద్దకే వెళ్లి సర్వీస్ చేయిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

అనాథకు అంత్యక్రియలు

హిందూపురం టౌన్: పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీ వద్ద మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహానికి మంగళవారం సల్తనతె-ఏ- ఖుదాదాత్ సంస్థ ప్రతినిధులు అంత్యక్రియలను నిర్వహించారు. అనాథ మృతదేహం వివరాలు లభ్యం కాకపోవడంతో వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్, సల్తనతె- ఏ- ఖుదాదాత్ అధ్యక్షుడు అతీఖురెహమాన్‌కు సమాచారం అందించారు. దీంతో వారు తమ మిత్ర బృందంతో కలిసి హస్నాబాద్ ముస్లిం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కుమార్ నాయక్, సిబ్బంది, ఉబెదుల్లా హుసేన్, హైదర్ అలీ, నాజిమ్, షాహిద్, సమీర్, ముజాహిద్, ఆర్బాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాలన అస్తవ్యస్తం

- రెగ్యులర్ అధికారులు కరువు
- ఇన్‌చార్జ్ బాధ్యతలతో సతమతం
- ముందుకు సాగని అభివృద్ధి పనులు
- పరిష్కారం కాని ప్రజా సమస్యలు
- ఇదీ పెనుకొండ డివిజన్ కేంద్రం దుస్థితి



పంచాయతీ రాజ్ కార్యాలయంలో డీఈ గదికి తాళం వేసిన దృశ్యం



పెనుకొండ నగరపంచాయతీ కార్యాలయం

పెనుకొండ రూరల్: డివిజన్ కేంద్రం పెనుకొండలోని పలు శాఖలకు రెగ్యులర్ అధికారులు లేరు. ఇన్‌చార్జ్‌లతోనే పాలన నెట్టుకొస్తున్నారు. మండలస్థాయి అధికారులకే డివిజన్, ఆ పైస్థాయి అధికారుల బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కారం కాక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పంచాయతీరాజ్‌లో జేఈ వెంకటరమణకు డీఈఈగా, మడకశిర గృహ నిర్మాణ శాఖ డీఈఈ శివశంకర్ నాయక్‌కు ఈఈ అదనపు బాధ్యతలను అప్పగించారు. ఇక పశుసంవర్ధక శాఖలో పెనుకొండ డిప్యూటీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలను హిందూపురం డీడీ పెంచులయ్యకు కేటాయించారు. సూక్ష్మ నీటి పారుదల శాఖలో జేఈ లక్ష్మీనారాయణకు డీఈఈగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో అధికారిగా విధులు నిర్వహిస్తున్న వై.సమత ఇటీవల బదీలిపై వెళ్లగా.. ఆమె స్థానంలో తాత్కాలిక అధికారిగా ఎంపీడీఓ నరేష్ కృష్ణను ఉన్నతాధికారులు నియమించారు. ఇక పెనుకొండ ఉద్యాన శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న రాంప్రసాద్‌కు అదనంగా సీకే పల్లి, రామగిరి, సోమందేపల్లి, రొద్దం మండలాల ఇన్‌చార్జ్ బాధ్యతలు కేటాయించారు.

తాత్కాలిక కమిషనరే దిక్కు

పెనుకొండ నగరపంచాయతీకి రెగ్యులర్ కమిషనర్ లేరు. తాత్కాలిక కమిషనర్‌గా కర్నూలు కమిషనర్ శ్రీనివాసులును నియమించారు. నగర పంచాయతీలో 20 వార్డుల పరిధిలో దాదాపు 50 వేల వరకు జనాభా ఉన్నారు. నగర పంచాయతీకి కమిషనర్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్లు-3 జూనియర్ అసిస్టెంట్లు-3 టౌన్ ప్లానింగ్ అధికారి-1 టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్-1 శానిటేషన్ ఇన్‌స్పెక్టర్-1 శానిటేషన్ మేస్త్రీ-2 మేనేజర్-1 అసిస్టెంట్ ఇంజినీర్-1 పోస్టులు ఉన్నాయి. అయితే ఇక్కడ ధర్మవరం, హిందూపురం మున్సిపాలిటీల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన ముగ్గురు సిబ్బంది, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఒక జూనియర్ అసిస్టెంట్‌తో నెట్టుకొస్తున్నారు. పలు సమస్యలతో వచ్చే ప్రజలు ఎవరిని సంప్రదించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

రెగ్యులర్ అధికారులను నియమించండి



ప్రజలే కాకుండా ఉద్యోగులు సైతం పెనుకొండలోని డివిజన్ స్థాయి కార్యాలయాలకు వివిధ సమస్యలపై వస్తుంటారు. అయితే మండల అధికారులకే డివిజన్‌స్థాయి అధికారులుగా అదనపు బాధ్యతలు అప్పగించినందున సరైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. ఒక పని మొదలు పెడితే ఎలా సంపూర్ణంగా పూర్తి చేయాలో అధికారులకే తెలియడం లేదు. ఇటీవల నగర పంచాయతీ కమిషనర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టిన అధికారి, వన్నికా ఫంక్షన్ హాల్ వీధిలో రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టారు. అంతలోనే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో పని మధ్యలోనే ఆగిపోయింది. కొద్ది రోజులకు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా మరొకరు బాధ్యతలు తీసుకున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ అధికారులను నియమిస్తే పాలన బాగుంటుంది.

– హరి, సీపీఎం డివిజన్ కార్యదర్శి, పెనుకొండ

సమస్యలు పరిష్కరించాలి



కొన్ని శాఖలలో డివిజన్ స్థాయి అధికారులు బాధ్యతలను తాత్కాలికంగా,మండల స్థాయి అధికారులకే అప్పగించడంతో పూర్తి స్థాయిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. సమస్యల పరిష్కారినికై వచ్చే ప్రజ లకు పరిష్కారం కాకుండానే వెనుతిరుగుతున్నారు.

– హరిలాల్ నాయక్, ఎస్‌హెచ్ఆర్‌సీ వైస్ ప్రెసిడెంట్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



తాత్కాలిక బాధ్యతలను నిర్వహిస్తున్న అధికారుల శాఖల పని తీరును పరిశీలిస్తాం. రెగ్యులర్ అధికారులు ఎక్కడెక్కడ నియమించాలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. త్వరలోనే సమస్యలు పరిష్కారమవుతాయి.

– ఆనంద్ కుమార్, ఆర్డీఓ, పెనుకొండ

ముస్లింల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఖలందర్

అమరాపురం: ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తామని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఖలందర్ తెలిపారు. స్థానిక విశ్రాంతి భవనంలో బుధవారం ముస్లిం సంక్షేమ సంఘం మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముస్లిం సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా హిదాయత్, ప్రధాన కార్యదర్శిగా మహబూబ్ బాషా, ఉపాధ్యక్షుడిగా అన్వర్, సహాయ కార్యదర్శిగా ఇబ్రహీం, కోశాధికారిగా తహజీబ్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా ముస్లిం సంక్షేమ సంఘం మండల యువత గౌరవ అధ్యక్షుడిగా నిజాముద్దీన్, మండల యువత అధ్యక్షుడిగా జమీర్, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్లా, కార్యదర్శిగా తాఫిక్ అహ్మద్, సహాయ కార్యదర్శిగా జిలాన్‌బేగ్, కోశాధికారిగా తాహిర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ముస్లిం కుటుంబాల్లో చాలా మంది పిల్లలు విద్యను మధ్యలో వదిలి వేరే పనులకు వెళ్లడం జరుగుతోందన్నారు. విద్యార్థులు మధ్యలో బడి మానేయకుండా బాగా చదివేలా చూస్తామన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో అస్లాం, దాదు, ఇబ్రహీం, అస్సేన్, షాదాత్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డ్వామా పీడీ నరసయ్య

అమరాపురం: మండలంలోని గొడనకుంట గ్రామంలో ఆ గ్రామ డెవెలప్‌మెంట్ ఫోరమ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు, పురుషులు, యువకులు, చిన్నారులకు మైండ్ గేమ్ తదితర పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలు గణితం మాస్టారు నాగరాజు, శ్రీరాములు ముగ్గులను పరిశీలించారు. ప్రథమ, ద్వితీయ విజేతలుగా రూప, వింధ్యను ఎంపిక చేశారు. ఇదే గ్రామానికి చెందిన శ్రీసత్యసాయి జిల్లా డ్వామా పీడీ, కెఎన్.నరసయ్య, పరిగి పంచాయతీలో విధులు నిర్వర్తిస్తున్న కార్యదర్శి నారాయణ, కె.శివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు రమేష్, యూనియన్ బ్యాంకు అధికారి హనుమంతరాయ, తదితరులు గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా గోల్డ్ కాయిన్, ద్వితీయ బహుమతి సిల్వర్ కాయిన్లు అందజేశారు. నారాయణ, రామప్పకు టైటాన్, సోనాటా వాచ్‌లు అందజేశారు. కర్ణాటకలోని తుమకూరు, బెంగళూరు, మైసూరు, చిత్రదుర్గంచ ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, పాల్గొన్నారు. కార్యక్రమంలో జీడీఎఫ్ సభ్యులు రాఘవేంద్ర, శ్రీధర్, హనుమంతరాయ, రమేష్, జగదీష్, నాగేశ్వర, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌కు సన్మానం



నిస్సార్‌ను సన్మానిస్తున్న ముస్లిం పెద్దలు

లేపాక్షి: ఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నిస్సార్ అహమ్మద్‌ను స్థానిక ముస్లింలు మసీదు ఆవరణలో బుధవారం ఉదయం ఘనంగా సన్మానించారు. మొదటి సారిగా వైఎస్సార్‌సీపీ అధిష్టానం ముస్లింను మండల కన్వీనర్‌గా ఎంపిక చేయడం పట్ల ముస్లిం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిస్సార్‌కు పూలమాలలు వేసి శాలువలతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ముస్లిం నాయకులు బషీర్, ఉస్మాన్, అయూబ్, సంసుద్దీన్, ఫజులు, అస్లాం, నదీముల్లా, హబీబ్‌సాబ్, ఇర్ఫాన్, ఫైజుల్లా, న్యామద్, అన్సార్, ముజహిద్, తంజీర్, ముత్తుజా, అజ్మత్, జమీర్, ఫరూక్, అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలోనే సరుకులు అందించాలి



గౌరిపురంలో వృద్ధుల సమస్యలను తెలుసుకుంటున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: మండల పరిధిలోని గౌరిపురం గ్రామంలోని ప్రజలు ఇబ్బందులు పడకుండా గ్రామంలోనే రేషన్ సరుకులు అందజేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప డిమాండ్ చేశారు. బుధవారం నాయకులతో కలిసి గౌరిపురంలో పర్యటించారు. ప్రజలు, వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. గ్రామంలో రేషన్‌షాపు లేకపోవడంతో పక్క గ్రామానికి వెళ్లేందుకు వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇద్దరు వృద్ధులకు గత రెండు నెలల నిత్యావసర సరుకులను ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈనెలలో మాత్రం సరుకులను అందించినట్లు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారుల ఇంటి వద్దకే సరుకులను అందించామన్నారు. ఇప్పటికైనా వృద్ధుల ఇబ్బందులను గుర్తించి గ్రామంలోనే సరుకులు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, నాయకులు ఆదిశేషు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణప్ప (54) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప బాధిత కుటుంబాన్ని పరార్శించారు. నారాయణప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు గీత, రంగనాథ్, ఎంపీపీ కవిత, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, ఎస్సీ, బీసీ సెల్ కార్యదర్శులు మంజునాథ్, సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన సంక్రాంతి



సడ్లపల్లిలో ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళకు బహుమతి అందిస్తున్న నాయకులు

హిందూపురం: సంక్రాంతి సందర్భంగా ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివిరిసిల్లాలని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ దీపికా అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి సారథ్యంలో పట్టణంలోని 13వ వార్డు సడ్లపల్లిలో వార్డు ఇన్‌చార్జిలు శబరీష్ రెడ్డి, శ్రీనాథ్, గోపాల్ రెడ్డిల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కాగా హిందూపురం మండలంలోని సంతేబిదనూర్‌లో రైతులు ఎద్దుల ఊరేగింపు నిర్వహించారు. ఎద్దులను ఆకర్షణీయంగా అలకరించి గ్రామ మధ్య వేసి దిష్టిచలి మంటల గుండా వాటిని ఎగిరించి అనంతరం పూజలు చేసి ఇంటికి తీసుకు ధాన్యగింజలు తినిపించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాము, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మడకశిర రూరల్/అగళి/మడకశిర/రొళ్ల: నియోజకవర్గంలోని ప్రజలు మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగను జరుపుకున్నారు. ఇళ్ల ముందు రంగవల్లులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. అనంతరం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేయించారు. పలు ఆలయాల్లో భక్తులకు ప్రసాదం అందజేశారు.

ఆకట్టుకున్న హరిదాసు కీర్తనలు

రొద్దం: సంక్రాంతి వేడుకల్లో బుధవారం ఉదయం మండల కేంద్రంలోని పెద్దాంజనేయస్వామి దేవాలయంలో అర్చకులు గిరీష్‌స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిదాసు కీర్తనలు గ్రామంలో అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీరామ భక్త మండల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: గొడనహళ్లి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఉద్యోగులు, యువకులకు నిర్వహించిన క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. విన్నర్స్‌గా ఎలైట్ ఈగల్స్, రన్నర్స్‌గా కాలనీ సూపర్ స్టార్స్ జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందించి అభినందించారు. అదే విధంగా మడకశిర పట్టణంలోని చాకలికుంటలో నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీలో విన్నర్స్‌గా రాజా టీమ్, రన్నర్స్‌గా రెడ్డి టీమ్ నిలిచాయి. విజేతలకు దాత తలమర్ల పవన్‌కుమార్ రూ.5 వేలు, 3 వేల నగదుతో పాటు షీల్డ్‌లను అందించారు. పవన్‌కుమార్‌ను క్రీడాకారులు అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు నవీన్, కిశోర్,సిద్దూ, కన్నా, క్రీడాకారులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



పెద్దాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న దృశ్యం



సంతేబిదనూర్‌లో ఎద్దులను ఊరేగిస్తున్న దృశ్యం

బహుజనులు రాజ్యాధికారం సాధించుకోవాలి



ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్న నాయకులు

హిందూపురం: దేశంలో అత్యధిక జనాభాకల్గిన బహుజనులు రాజ్యాధికారం సాధించుకోవాలని, అప్పుడే వారు అన్నివిధాలుగా అభ్యున్నతి సాధించగలరని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శులు శ్రీరాములు, కొల్లకుంట నాగరాజు అన్నారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తర ప్రదేశ్ మాజీ సీఎం మాయావతి పుట్టిన రోజు సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి బాణసంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. తర్వాత ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు హరికుమార్, రామాంజనేయులు, సుబ్బరాయప్ప, నారాయణ, పెన్నయ్య తదతరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు





గాయపడిన వంశీ, చాంద్‌బాషా

రొద్దం: మండల కేంద్రం రొద్దానికి చెందిన మేస్త్రీ నరసింహులు కొడుకు వంశీ, కార్పెంటర్ నూర్‌మహమ్మద్ బుధవారం కర్ణాటక రాష్ట్రం పావగడ వైపు నుంచి ఆర్.మరువపల్లికి ద్విచక్రవాహనంపై వస్తుండగా చెక్‌పోస్ట్ సమీపాన మలువులో అదుపుతప్పి కిందపడ్డారు. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో వంశీని ప్రైవేట్ వాహనంలో రొద్దం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, చాంద్‌బాషాను 108 వాహనంలో పెనుకొండ ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పరిగి: మండలంలోని పెన్నా, జయమంగళి నదుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసులు నమోదు చేశామన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి



ఈరలక్కప్పను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శివప్రసాద్, నాయకులు

గుడిబండ: ఇటీవల వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన రొళ్ల మండలానికి చెందిన శివప్రసాద్, రాష్ట్ర కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు రంగేగౌడు తదితరులు మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని ఫళారం గ్రామంలో సమన్వయ కర్త ఈరలక్కప్పను కలిశారు. ఈరలక్కప్పను శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకానికి సహకరించిన ఈరలక్కప్పకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసన్న, నాగేష్, సత్యప్ప, తిప్పేస్వామి, క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామి జయంతి

పావగడ: వడ్డెర సామాజిక ఆరాధ్య దైవమైన ఇమ్మడి సిద్ధేశ్వర స్వామి జయంతి వేడుకలు తాలూకా కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ వరదరాజు సిద్ధేశ్వరస్వామి చిత్రపటానికి పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన రూరల్ సీఐ గిరీశ్ మాట్లాడుతూ.. వడ్డెర్లు దురలవాట్లకు బానిసలు కాకుండా సన్మార్గంలో నడవాలన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని.. తమ పిల్లల్ని విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో పలువురు వడ్డెర సామాజిక ప్రముఖులు పాల్గొన్నారు.

డ్రైనేజీని శుభ్రం చేయాలి

మడకశిర: పట్టణంలో 14వ వార్డు పరిధిలోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయ రోడ్డులో పూడిపోయిన డ్రైనేజీని వెంటనే శుభ్రం చేయాలని స్థానికులు మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. డ్రైనేజీ పూడిపోవడంతో మురుగు నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ మురుగు ప్రవహిస్తుండటంతో దుర్వాసన వస్తోందని తెలిపారు. ఫలితంగా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. నెల రోజులుగా మురుగు రోడ్డుపై ప్రవహిస్తున్నా.. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా నిర్లక్ష్య ధోరణి వీడి డ్రైనేజీని శుభ్రం చేయించాలని కోరారు.

భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్‌లో ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న భరత్

పావగడ: జాతీయ స్థాయి విజ్ఞాన వస్తు ప్రదర్శనలో తాలూకాలోని అరసికెరె ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి ఎం.భరత్ సత్తా చాటాడు. తృతీయ స్థానంలో నిలిచి బంగారు పతకం కై వసం చేసుకున్నాడు. మధ్యప్రదేశ్ బుర్హాన్‌పూర్ వేదికగా ఈనెల 13, 14 తేదీల్లో 5వ భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్ (బీఎస్‌టీఎఫ్)–2025 నిర్వహించారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ సైంటిస్ట్, ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎంగ్ సైంటిస్ట్, రామన్ విజ్ఞాన, తంత్రజ్ఞాన సంస్థ, మ్యాక్రో విషన్ అకాడమీ బుర్హాన్‌పుర్ సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో భరత్ తృతీయ స్థానంలో నిలిచాడు. దేశ ప్రఖ్యాత విజ్ఞానులు డా జేజే రావల్, డా బీకే త్యాగి, దిలీప్ భట్ తదితర ప్రముఖ విజ్ఞానుల సమక్షంలో విజేత భరత్ బంగారు పతకాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థి విజయానికి కృషి చేసిన పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు రేణుకారాజ్, విజేత భరత్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఘనంగా శయనోత్సవం

హిందూపురం: పట్టణంలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం శయనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. సాయంత్రం స్వామివారికి భక్తులు పిండివంటలు, ఫలహారాలు నైవేద్యాలు సమర్పించి మంగళ హారతులిచ్చి భక్తిపాటలు ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సురేంద్ర,అశ్వర్థనారాయణ, భజన మండలి సభ్యులు సుమ, గీత, వసంత తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ నిర్మాణానికి విరాళం

లేపాక్షి: లేపాక్షి గ్రామ సచివాలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గాదేవి ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి గొరిగానపల్లి సమీపంలోని బాలాజీ ఆగ్రో ఫారం మేనేజర్ గంగాధర్ ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులకు రూ. 50 వేలను బుధవారం విరాళంగా అందజేశారు. ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి మరింత సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220717, 9912220723
9705346587, 9912220726